కథ

# పాలెగాడు

—భైరవయ్య

రామానాయుడు బెజవాడ గుడిసెల్లా భగ్గుమని మండుతున్నాడు. తలుచుకుంటున్న కొద్దీ రెంటచింతలో ఎండలా — నడి వేసవిలో ఇసుక పర్రమీద సూర్యుడిలా మండుతున్నాడు. ఆలోచిస్తున్నకొద్దీ మంటలు భగ్గు భగ్గుమని గుండెల్లో. అతనిలో సహనం నశించి పోతోంది రాయలసీమ బావుల్లో నీళ్ళ లాగ.

'ఛ ఛ ముచ్చటపడి కులగౌరవానికి దీటుగా పెంచుకున్న మీస కట్టుకే అవమానం — ఈ సంగతి ముసలినాయుడికి తెలిస్తే—గొరిగెయ్యరా బోడిమీసకట్టు— అంటాడు. అయినవాళ్ళు— నాయుడి మీసంమీద నిమ్మకాయలు కాదు గురివెంద గింజకూడా నిలవదంటారు—ఛీ వెధవబతుకు. ఊరు ఊరంతటినీ—జిల్లా జిల్లానంతటినీ చూపుతో నిలబెట్టగలనాయుడు—రాజకీయ పార్టీల బ్రతుకుల్తో చెలగాటాలాడగల నాయుడు — చేతకాక, చేతులకి గాజులు తొడుక్కున్నట్టు (సీమంతం పెళ్ళికూతురిలా) కూర్చోడమా—ఛస్....

నాయుడికి ఒంటిమీద జెర్రిగొడ్లు—జలగలు నత్తగుల్లలు పాకుతున్నట్లయింది.

'అయినా ఏంజూసుకునంట—వాడు, నిన్నగాక మొన్న మీసం పెంచటం మొదలెట్టినవాడు—వారం రోజులిక్రితమే తన కొనగంటి చూపుల కరుణతో పంచాయతీ మెంబరైనవాడు—ఖద్దరు పంచె, జరీ అంచు కనపడేలా బిళ్ళగోచీతో పంచె కట్టడం తన దగ్గర నేర్చినవాడు—పెళ్ళైన నెల్లాళ్ళకే చచ్చిన (ఈడే చంపాడేమో), మావగారి నూటయాభై ఎకరాలు హక్కుభుక్తం చేసుకున్నవాడు—పెళ్ళాం సొమ్ముతిని బతక నేర్చినవాడు—వాడు—ఆ బసిరెడ్డిగాడు తను బంగారు తలాటం వేయించిన చేతికర్ర పట్టుకుని ఇద్దరు పొరుగూరు పెద్దరైతులతో పొలం గట్టుని నడుస్తుంటేచూసి, పలకరించకుండా—నోట్లో బీడీ తియ్యకుండా — కిసుక్కున నవ్వి వెళ్ళిపోతాడా, ఏంజూసుకునంట ఆ పైత్యం. అదిపోనీ—మొన్న పడమటేపు పొలంలో కుప్పనూర్చిన

ధాన్యం బళ్ళమీద తీసుకొస్తుంటే వాడి పొలంలో కుప్పనూరుస్తున్నారని చెప్పి బళ్ళని రానివ్వకుండా అడ్డునిలిచి ఇంకా కుప్పనూరుస్తున్న తనపొలంలోకి బళ్ళని మళ్ళిస్తాడా. ఎంతకావరం.

తను వాడిని ఎన్నిమాట్లు కాపాడలేదు.

ఓసారి సందెవేళ పూజారి కోడలు చెరువుకు నీళ్ళకొస్తే చాటునించొచ్చి చెయ్యట్టుకుంటే—ఆడకూతురు లబోదిబోమంటే—నలుగురూచేరి మక్కెలిరగదన్ని—పంచాయతీ జరపమంటే—వాళ్ళనోళ్ళు మూయించెందవరు. తనేగా.

ఓ మాపటేళ పొలంనించి తిరిగొస్తున్న మాల పడుచుని వాటేసుకుంటే మాలోళ్ళంతా కర్రలుచ్చుకుని వెంట పడితే వాళ్ళనాపిందెవరు. కర్రెత్తిన మాలోణ్ణి మట్టిలో కలిపేస్తానని గర్జించిందెవరూ తనేగా.

వాడికా విశ్వాసం ఏమాత్రమైనా—హుఁ—నీచపు నాయాళ్ళని జేరనియ్యద్దురా అని ముసలి నాయుడు చెప్తే విన్నాడా తను. ఛ—ఛ—వాణ్ణేం జెయ్యాలి. పబ్లిగ్గా ఏం జెయ్యడానికి వీల్లేదు. నిన్నమొన్నటిదాకా వాణ్ణిపొగిడి మెంబెర్నిచేసి ఇప్పుడు తనే వాణ్నేదన్నాచేస్తే తనమాటకి విలువేముంటుంది. అలా అనీ వాణ్నొదిలేస్తే అచ్చోసిన ఆంబోతవుతాడు. నాయుణ్ణి అవమానించినోడు—వాణ్ణి అలాచూస్తూ ఊరుకోడమా—ఊరుకుంటే నలుగురూ వీపెనకాల నవ్వుతారు. ఇవ్వాళీడవుతే రేపింకోడు అందరికీ అదే పరసవుతుంది. లాభంలేదు. విషపు మొక్కని మొదట్లోనే తుంచెయ్యాలి.

నాయుడు బుర్ర సక్కసులో జెయింట్ వీలులా తిరుగుతోంది. కళ్ళు రాకెట్లలా పొగలు మంటలు కక్కుతున్నాయి.

పొద్దుట కాఫీతాగి చుట్ట ముట్టించిననాయుడు మధ్యాన్నందాకా ఆలోచిస్తూనే వున్నాడు. భోజనానికి పిలవ్వొచ్చిన పెళ్ళాం మీద విసుక్కుంటూనే భోంచేశాడు. భోంచేస్తూ ఆలోచిస్తూనేవున్నాడు. భోంచేసాకా మళ్ళీ చుట్టముట్టించి ఆలోచిస్తూనే వున్నాడు. బెండకాయలు ముక్కలుగాకోసి నీళ్ళతో కడుగుతుంటే చేతులకంటుకుని జిగురొదలకుండా పట్టుకున్నట్టు ఆలోచన్లు తెగటంలేదు.

'ఏం చెయ్యడం' అన్నసమస్య—ప్రపంచానికి వియత్నాం సమస్యలా—వంద రూపాయల గుమాస్తాకి ఏడాదికో ఆడపిల్లలా—పెరిగిపోతోంది. పెద్దదవుతోంది. పరిష్కార మార్గం కనిపించటంలేదు.

ఇంతలో వచ్చాడు రంగయ్య. మూడు సీసాల నాటుసారా త్రాగింతర్వాత సీలువిప్పదియ్యని విదేశపు విస్కీ సీసాచూసినప్పుడు ఆనందంతో ఎరుపెక్కిన కళ్ళలా అయ్యాడు నాయుడు. ఆప్యాయంగా రంగయ్యని పిలిచి స్వయంగా చుట్ట కట్టిచ్చి దగ్గర కూర్చోపెట్టుకున్నాడు.

నాయుడు కుంభకర్ణుడిలా—కింకాంగ్‌లా వుంటాడు. నాయుడ్ని చూస్తే ప్రజలు భయపడుతారు.

రంగయ్య సన్నగా చచ్చుపీనుగులా వుంటాడు. రంగయ్యని చూస్తే ప్రజలు ఠపీమని ప్రాణాలు విడిచేసారు.

రంగయ్య నాయుడు నమ్మినబంటు. నమ్ముకున్న బంటు.

రంగయ్యకి తన సమస్యవివరించాడు నాయుడు. వాణ్ణి—ఆ బసిరెడ్డిగాణ్ణి నిలువునా పాతెయ్యాలన్నాడు. పూర్వకాలం కాకపోయింది కాని లేకపోతే నూరడుగుల గొయ్యి తవ్వించి, ఒంటి మీద చర్మం బులబులాగ్గా ఒలిపించి, కారంపూసి ఉప్పులో ఊరేయించే వాణ్ణన్నాడు. వాడిపొడ తనగిట్టదన్నాడు. ఈ అవమానం తనుభరించ లేనన్నాడు.

రంగయ్య తాపీగా విన్నాడు. అణు ఏటంబాంబులు తయారు చేసుకకూర్చున్న పెద్ద దేశానికి 'మీ పెరట్లో' వేపాకు గాలికి మా పెరట్లో వాలిందని కొట్టుకుంటున్న రెండు చిన్న దేశాలు దొరికినట్టయింది రంగయ్యకి.

నాయుడు ఆత్రంగా చూస్తున్నాడు. గంజి గుంట దగ్గర కుక్కలాచూస్తున్నాడు.

అప్పుపేరిట భిక్షకోసం వచ్చిన చిన్న దేశాన్ని, పెద్ద దేశం చూసినట్టుగా చూశాడు రంగయ్య నాయుడ్ని. చుట్ట పొగగుక్కపట్టి వదిలి కళ్ళుమూసుకున్నాడు.

'నాయుడుగోరో' అన్నాడు రంగయ్య.

మీసం సరిజేసుకున్నాడు నాయుడు.

'ఆ బసిరెడ్డిగాణ్ణి సంపెయ్యటం ఏమంత కట్టంకాదు గాని—ఆణ్ణి సంపేత్తే మనకేటినాబం' అన్నాడు.

నయా పైసల్లో మాట్లాడుతాడు రంగయ్య.

'వాడవమానం జేసేడు. నాయుణ్ణి నన్నవమానం జేసేడు.

'అదిరైటే నాయుడుగోరో. కాని ఆడుసత్తే నాబంలేదు.

'ఎందుకంట'

'ఆరునెల్లలో పెద్దెలెచ్చన్లు గదంటండీ—ఆడుసత్తే రెడ్లేపు ఓటెవడిత్తాడు.

'ఏం ఎందుకియ్యరు, మన్నికాదనే ఓడెవడు.'

'ఆడనేవుంది తిరకాసు. కోపందెచ్చుకోకండి గానీ ఈ మద్దెనాడు మంచి పరపతి సంపాయించేడు గదంటండీ. అణ్ణీప్పుడప్పుడే తీసేస్తే ఎట్టా'

'తీసెయ్యకపోతే ఎట్టా'

'అదే గదండి మరీ. సెంద్రరెడ్డిక్కూడ మంచి పరపతేవుంది గానీ ఆరంత గాదండి. ఎలచ్చన్లయ్యేదాకా బసిరెడ్డిని దువ్వి—ఈ లోపల సెంద్రరెడ్డిని పైకిదియ్యండి• ఎలచ్చన్లవంగానే బసిరెడ్డిని తుడిసేద్దారి.'

'అందాకా వూరుకుంటే ఎట్టా. ఈ లోపునాడికి కొవ్వెక్కిపోదో. అంతవరకూ వూరికే కూసోమన్నావా.'

నాయుడు హుంకరించాడు.

'ఊరికే కూసోడమెందుకండీ. ఈ లోపునేనోట సేద్దారి.'

'అదేగద నేనడిగేది'

రంగయ్య మళ్ళీ కళ్ళుమూసుకున్నాడు.

నాయుడు మళ్ళీ ఆత్రంగా చూస్తున్నాడు.

"నాయుడుగోరో ఎల్లుండాదోరంనాడు బసిరెడ్డి తూర్పేపు కుప్పనూర్చిన ధాన్యం బళ్ళకెత్తుతారు గదంటండే."

'అయితే'

'అదేంది నాయుడుగోరో బళ్ళమీది ధాన్యం బళ్ళలోనే మాయంజేస్తే సరిగంద'

'అంటే దొంగతనమా'

నాయుడిలో అన్నిగుణాలూ వున్నాయి. కాని దొంగతనం మటుకులేదు. గురివింద గింజికి నలుపులాగ.

రంగయ్య బ్రష్ మీసాల్లో నవ్వుకున్నాడు. ఎమ్. ఏ. మాథమెటిక్స్ యూనివర్సిటీ కంతటికీ ఫస్టుగా పాసయిన కొత్త లెక్చరరు అర్థమెటిక్ ప్రోగ్రెషన్ అర్థంకాని పి. యు. సి. కుర్రాళ్ళని చూసినట్టుగా నాయుడ్ని చూసాడు రంగయ్య.

'కాదు నాయుడిగోరో సెప్పేదినండి మరి. ఆ బళ్ళ మొగిలిపుంతమ్మేగదండి బండొచ్చేది. ఒడుపుసూసి తగలెడితేసరి.'

'మరి ... '

నాయుణ్ణి మధ్యలో ఆపి 'యెంకట రత్తానికి బసిరెడ్డికి సెడింది గదండీ. ఇదా యెంకట రత్తంమీద తోసేద్దారి.'

టో మేటాల్లా ఎర్రగావున్న నాయుడు కళ్ళు ఫక్కుమని పగిలాయి.

రంగయ్య బుజంమీద హాయిగా చరిచాడు నాయుడు. జీతగాణ్ణి పిలిచి ఇంట్లోంచి స్పెషలు పొగాకు తనకన్నా హోదాలో పెద్దాళ్ళు మంత్రులు వచ్చినప్పుడు ఇచ్చేది తెప్పించి చుట్టకట్టి రంగయ్యకిచ్చేడు. రంగయ్య యధాలాపంగా అందుకున్నాడు అదేదో తన జన్మహక్కన్నట్టు.

నాయుడికి సంతోషంగా వుంది. ఒంట్లో శక్తిలేని గజ్జికుక్కకి ఎముకముక్క దొరికినట్టుగావుంది.

ఆదివారం ఎప్పుడెప్పుడా అని ఎదురుచూస్తున్నాడు నాయుడు. పెళ్ళి భోజనానికి వచ్చినవాళ్ళు ఎప్పుడులేస్తారా ఎప్పుడెంగిలాకులు పారేస్తారా అని చెత్తకుండీదగ్గర కూర్చున్న కుక్కలా ఎదురుచూస్తున్నాడు.

ఆదివారం వచ్చించి.

నాయుడు హుషారుగా వున్నాడు. శోభనం పెళ్ళికొడుకులా వున్నాడు.

రంగయ్య సలహామీద ఆదివారంనాడు సాయంకాలం బసిరెడ్డిని ఆహ్వానించాడు.

అంత శత్రువులైన రెండు అగ్రరాజ్యాల కలయికలావుంది. విదేశీ సరుకుసీలు తీసాడు నాయుడు. గ్లాసులు గలగల మన్నాయి. నాయుడు ఖళ్ళు ఖళ్ళుమని నవ్వుతూ మాట్లాడుతున్నాడు. బసిరెడ్డిని మినిష్టర్ని చేస్తానన్నాడు. పైకెక్కించేస్తానన్నాడు. పెద్దోడి వయ్యాక నన్ను మర్చిపోకు రెడ్డీ' అని జోకేసాడు. ఘొల్లుమని నవ్వాడు. బసిరెడ్డినవ్వాడు. స్కూలు జీతం కట్టమనిచ్చిన డబ్బు తీసుకుని తన దగ్గరకు వచ్చిన కుర్రోణ్ణిచూసి అనుభవంనించిన బోగంది నవ్వినట్టుగా నవ్వాడు.

నాయుడు కళ్ళు సంతోషంతో మండుతున్నాయి.

దూరంగా మంటలు. కేకలు.

నాయుడు గుండె ఆనందంతో స్పీడెక్కింది. రంగయ్యకేసిచూసి నవ్వాడు. రంగయ్య ఫకాలుమని నవ్వాడు. బసిరెడ్డి పెదాలమీదకూడా నవ్వున్నట్టుంది.

దూరంగా ఎవడో పరుగునొస్తున్నాడు. వాడొచ్చేసాడు. వస్తూనే 'నాయుడుగోరో' అని కేకపెట్టాడు.

నాయుడిగుండె .......

'ఏంట్రా' అన్నాడు.

నాయుడుగోరో సినబాబుగారి తల పగిలి పోనాదండి. కుప్పేసిన పంట తగలెట్టేసారండి, అని ఒగిర్చాడు.

పాపం నాయుడు .... గుండెకాయ .... రంగయ్యకేసి చూసాడు. తనిచ్చిన ఆయుధాలతో తనరాజ్యాన్నే విధ్వంసంచేసిన చిన్న రాజ్యాన్ని, అగ్రరాజ్యం చూసినట్టుగా జూసాడు.

రంగయ్య ఫెళ్ళుననవ్వాడు. గాలివానకి ఎండిన చింతచెట్టు విరిగి పడ్డట్టుగా నవ్వాడు. వొడి తిరగని మీసం వొడేసాడు బసిరెడ్డి.

'చచ్చి ఏలోకాన్నుందో–నా అడదానికిచ్చినమాట నిలబెట్టుకున్నాను నాయుడూ.'

రంగయ్యన్న మాటలు గుండాగిపోయిన నాయుడు విన్నాడోలేదో.

★


కా శో జీ జీ వ న గీ త

(ఖలీల్ జిబ్రాన్ "ది ప్రాఫెట్"కు తెనుగు సేత)

నవజీవన గీత — మానవ జీవన గీత

* ప్రపంచంలో చెప్పుకోతగ్గ ప్రతి భాషలోనికి అనువదించబడి, ఒక్క ఇంగ్లీషు భాషలోనే 20 లక్షల ప్రతులకుపైగా అమ్ముడుపోయి, ప్రతి వారం ఐదువేల ప్రతులచొప్పున అమ్మబడుతున్నదీ గ్రంథం—టైమ్—ఆగస్టు 13, 1965.

* యువభారతి మలిప్రయత్నం.

* డెమ్మీ సైజులో, బాపూ ముఖచిత్రాలంకరణతో ఫిబ్రవరి ముగియక మునుపే వెలువడుతుంది.

* అమూల్యమయిన ఈ గ్రంథానికి వెలలేదు గాని రెండు రూపాయలకు తక్కువ గాని విరాళాన్ని ఈ క్రింది చిరునామాకు ఫిబ్రవరి 15లోగా మనియార్డరుచేస్తే

ఫిబ్రవరి ఆఖరయ్యేలోగా పుస్తకప్రతి మీ చేతుల్లో ఉంటుంది.

**యువ భారతి,** సాహితీ సాంస్కృతిక సంస్థ, (రి. నెం. 1/64)

5, కింగ్స్వే, సికింద్రాబాదు ఆం. ప్ర.